క్లుప్తంగా

అన్నదానం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మార్కెట్ సెంటర్‌లోని మహాలక్ష్మి బొడ్డురాయి సెంటర్‌లో దేవీ శరన్నవరాత్రి వేడుకలు ఆదివారం వైభవంగా ముగిశాయి. దుర్గమ్మకు విశేష పూజలు నిర్వహించి అమ్మవారి చల్లని దీవెనలు ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ వార్డు కౌన్సిలర్లు గుంజా శ్రీనివాస్, బాడిశ నాగరాజకుమారి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మిక్కిలి శరభయ్య, చెన్నకేశవ రామాలయం ఆలయ కమిటీ అధ్యక్షుడు పల్లపోతు బ్రహ్మాజీ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నేతలు అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు.

పీటీడీ అద్దె బస్సుల సంఘ కార్యవర్గం ఎన్నిక



తిరువూరు: ఆర్టీసీ అద్దెబస్సుల డ్రైవర్లకు సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్లో ఆదివారం ఆర్టీసీ అద్దెబస్సుల డ్రైవర్ల అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవాధ్యక్షుడిగా బి.వెంకటేశ్వరరావు, అధ్యక్షుడిగా ఎండీ కరీముల్లా, ప్రధాన కార్యదర్శిగా శ్రీమన్నారాయణ, సంయుక్త కార్యదర్శిగా శ్రీహరి, కోశాధికారిగా సంజు ఎన్నికయ్యారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడికి నిరసన



తిరువూరు: నెల్లూరు జిల్లాలో పీటీడీ బస్ డ్రైవర్‌పై దాడికి పాల్పడిన ఘటనను నిరసిస్తూ తిరువూరు ఆర్టీసీ బస్టాండులో ఆదివారం కార్మికులు ధర్నా చేశారు. విధి నిర్వహణలో ఉన్న డ్రైవర్‌పై అకారణంగా దాడికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ప్రజా రవాణా సంస్థ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఎంప్లాయీస్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ తదితర సంఘాల నాయకులు రామకృష్ణ, పీకే రెడ్డి, ఏవై రెడ్డి, స్వామి, సాంబశివరావు, చలపతిరావు, సూపర్‌వైజర్లు, గ్యారేజీ కార్మికులు పాల్గొన్నారు.

నేడు మర్రిబంధంలో జగనన్న ఆరోగ్య సురక్ష

నూజివీడు: మండలంలోని మర్రిబంధంలో ఈ నెల 30న జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పీఏ విజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే వైద్య శిబిరంలో స్పెషలిస్టు వైద్యులు, గొల్లపల్లి, దిగవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పాల్గొని వైద్య పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ప్రజలు వైద్య శిబిరానికి విచ్చేసి పరీక్షలు చేయించుకోవాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

వీరులపాడు: ఆరు రాష్ట్రాల్లో 42 శాఖల ద్వారా రూ.3,620 కోట్లకు పైగా వ్యాపారం చేస్తున్నట్లు వీరులపాడు సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.సుబ్బయ్య చౌదరి తెలిపారు. వీరులపాడు సిటిజన్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ వీరులపాడు బ్రాంచ్ ఆధ్వర్యంలో పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో 95శాతం మార్కులు సాధించిన ఖాతా దారుల పిల్లలకు ఆదివారం ప్రతిభా పురస్కారాలతో పాటు రూ.10 వేల నగదు బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిటిజన్ సొసైటీ సభ్యులకు కూడా గతేడాది 25శాతం డివిడెండ్ చెల్లించినట్లు చెప్పారు. చదువులో అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తున్న ఖాతాదారుల పిల్లలకు 26 ఏళ్లుగా పురస్కారాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఖాతాదారులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నందిగామ: చంద్రగ్రహణం పూర్తయిన తర్వాత ఆదివారం ఉదయం సంప్రోక్షణ అనంతరం అర్చకులు మండలంలోని ఆయా ఆలయాల్లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. మండలాల్లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన దాములూరు కూడలి సంగమేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. నందిగామ, మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లోనూ సంప్రోక్షణ అనంతరం స్వామివార్లకు భక్తులు విశేష పూజలు నిర్వహించారు.

సొంతింటి కల సాకారం

'మైలవరం'లో గ్రామాలను తలపిస్తున్న జగనన్న కాలనీలు



కేతనకొండలో పూర్తయిన ఇల్లు



ఇబ్రహీంపట్నంలో జగనన్న కాలనీ

ఇబ్రహీంపట్నం: పేదల సొంతింటి కల నెరవేరింది. అద్దెల దరువు తప్పింది. ఇదంతా జగనన్న కాలనీల వల్లే అని లబ్ధిదారులు చెబుతున్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రికలుగా నిర్మాణాలు జరుపుకుంటున్న జగనన్న కాలనీలు గ్రామాలను తలపిస్తున్నాయి. నియోజకవర్గంలో అనేక గ్రామాల్లో స్థలాలు కేటాయించి నిధులు మంజూరు చేయడంతో ఆదర్శ గ్రామాలు ఏర్పాటు జరుగుతున్నాయి. ఇబ్రహీంపట్నంలో 4,913 ప్లాట్లు లబ్ధిదారులకు కేటాయించగా మైలవరం నియోజవర్గంలో 23,253 కేటాయించారు. సుమా రు 5వేలు గృహాల నిర్మాణం పూర్తివడంతో లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేశారు.

ఆదర్శ కాలనీలుగా..

నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం, కొండపల్లిలో ఆదర్శ కాలనీల ఏర్పాటు జరుగుతున్నాయి. ఇబ్రహీంపట్నం మండలం , కొండపల్లి మున్సిపాల్టీలకు 4,913 ప్లాట్లు కేటాయించగా కొండపల్లికి 1515 ప్లాట్లు మంజూరు చేశారు. ఈస్థలాల పక్కనే విజయవాడ రూరల్, పశ్చిమ నియోజక వర్గాల లబ్ధిదారులకు మరో 40 ఎకరాలు సేకరించి పంపిణీకి సిద్ధం చేశారు. 1515 ప్లాట్లలో ఇళ్ల నిర్మాణాలు పూర్తికావచ్చాయి. ఇబ్రహీంపట్నంలో 1602, రూరల్ గ్రామాల్లో 1796 ప్లాట్లు కేటాయించగా సుమారు 60శాతం పైగా నిర్మాణాలు చేయడంతో గృహ ప్రవేశాలు జరిగాయి. ఈప్రాంతం విజయవాడకు అతి దగ్గరగా ఉండటంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన విధానాల్లో ప్రభుత్వ నిధులు రూ.1.80లక్షలు దశలవారీగా సొంత డబ్బుతో గ్రౌండ్ ఫ్లోర్ పూర్తి చేసుకున్నారు. కొండపల్లిలో 1515 ప్లాట్లుతో పాటు విజయవాడ నగరానికి చెందిన సుమారు 6వేలు మందికి ప్లాట్లు కేటాయిస్తే సుమారు 25వేల జనాభాతో పెద్ద పట్టణం ఏర్పాటయ్యే అవకాశం కనిపిస్తోంది.

మౌలిక వసతుల కల్పనకు కృషి

జగనన్న కాలనీల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు. ఇప్పటికే అనేక కాలనీల్లో వి ద్యుత్ సదుపాయం, వీధిలైట్లు, రోడ్లు, తాగునీటి సదుపాయం కల్పించారు. మిగిలిన రోడ్లు, డ్రైనేజీలకు గృహ నిర్మాణ శాఖ అధికారులతో అంచనాలు రూపొందించారు. మిగిలిన ఇళ్లు కూడా పూర్తయ్యేలా వివిధశాఖల అధికారులతో సమీక్షిస్తున్నారు. మెటీరియల్ తీసుకునే వారికి ఇసుక, సిమెంటు, స్టీలు అందుబాటులో ఉంచారు. ప్రభుత్వం ఇచ్చే నగదుతో పాటు బ్యాంకులద్వారా సుమారు రూ. 30 నుంచి రూ.70వేలు రుణ సదుపాయం కల్పించారు. గతంలో ఏర్పడిన కాలనీలకు భిన్నంగా వివిధ సా మాజిక వర్గాల కలయికతో ఏర్పడుతున్న జగనన్న కాలనీలు ఆదర్శ గ్రామాలుగా మారుతున్నాయి.

జగనన్నకు రుణపడి ఉంటాం



ఆరేళ్ల పాటు అద్దె ఇంటిలో ఉండి ఇబ్బందులు పడ్డాం. పిల్లల చదువులు, కుటుంబ ఖర్చులు అద్దె కట్టలేక పోయాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలం ఇచ్చి నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. సొంతింటి కష్టాలు తీరాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

–షేక్ పఠాన్ జాన్‌బీ, లబ్ధిదారురాలు, కేతనకొండ

ఎన్నో ఏళ్లు ఎదురు చూశాం



సొంతింటి కోసం ఎన్నో ఏళ్ల ఎదురు చూశాం. ప్రస్తుత ప్రభుత్వంలో మా కల నెరవేరింది. ఆటోడ్రైవర్‌ని. తల్లి దండ్రులు, భార్యా పిల్లలతో అద్దె ఇంట్లో ఉన్నాను. ఈ ప్రభుత్వంలో ఇంటిస్థలం, నిధులు ఇచ్చారు. సొంతిల్లు కట్టుకుని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతున్నాను.

–బాదావత్ మదార్, లబ్ధిదారుడు, కిలేశపురం

ప్రజలకు ఆరోగ్య సురక్ష

- గంపలగూడెంలో వైద్యశిబిరాలకు విశేష స్పందన
- 14,977 మంది రోగులకు సేవలు
- 20,255 ఈసీజీ, బ్లడ్, కంటి, ఇతర పరీక్షలు



మందులు అందజేస్తున్న సిబ్బంది

గంపలగూడెం: ప్రజల ఆరోగ్య భద్రతకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలకు గంపలగూడెం మండలంలో విశేష స్పందన వచ్చింది. మండలంలోని 19 గ్రామ సచివాలయాల పరిధిలో సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 26వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గంపలగూడెం, ఊటుకూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలోని ఆయా గ్రామ సచివాలయాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు మండల స్థాయి అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక వైద్యశిబిరాలను నిర్వహించారు. సాధారణ వైద్య పరీక్షలతోపాటుగా గుండె, ఆర్థో, పిడియాట్రిక్, సైకాలజీ, కంటి రోగులను కూడా ప్రత్యేక వైద్యులు పరీక్షించి కావల్సిన మందులను పంపిణీ చేశారు.

14,977మందికి అందిన వైద్యసేవలు

ఆయా సచివాలయాల్లో 19 రోజులపాటు నిర్వహించిన వైద్యశిబిరాల్లో 14,977మందికి వివిధ రకాలకు చెందిన 20,255 పరీక్షలు చేసినట్లు గంపలగూడెం, ఊటుకూరు పీహెచ్‌సీల వైద్యాధికారి శ్రుతి, సురేష్ తెలిపారు. 974మందికి ఈసీజీ, 486మందికి గైనకాలజీ, 753మంది చిన్నపిల్లలకు వైద్యసేవలు, 760 మందికి ఎముక సంబంధిత వ్యాధి పరీక్షలు, 1495 మంది రోగులకు ఫిజీషియన్ వైద్యులు, వైఎస్సార్ కంటి వెలుగులో 2,015మంది కంటి పరీక్షలు, 1,900మందికి షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్ష, 2,742మందికి సాధారణ వైద్యసేవలు అందజేశారు.

ఆరోగ్య సేవలు పొందిన వారి వివరాలు

అమ్మిరెడ్డిగూడెం-905, అనుముల్లంక-969, చింతలనర్వ-749, గంపలగూడెం-1003, గోసవీడు-725, కనుమూరు -830, కొత్తపల్లి-831, మేడూరు-1015, పెద్దకొమిర- 746, వినగడప-600, ఊటుకూరు- 603, కొణిజెర్ల-673, నెమలి-725, ఆర్లపాడు-309, గొల్లపూడి- 773, పెనుగొలను-863, పెనుగొలను(2)-815, దుందిరాలపాడు- 621, తునికిపాడు-1,222 మంది క్యాంపులకు హాజరై తగిన వైద్యసేవలు పొందారు.

మెరుగైన వైద్యం అందించాం



జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో మండల ప్రజలకు మెరుగైన వైద్యసేవల్ని అందించగలిగాం. మందులను ప్రభుత్వం సరఫరా చేయగా రోగులకు అందించాం. కిడ్నీ రోగులకు సైతం మందులను ఈ క్యాంపుల్లో పంపిణీ చేశాం. ప్రత్యేక వైద్యం అవసరమైన రోగులను విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి సిఫార్సుచేశాం.

–వి. శ్రుతి, వైద్యాధికారి, గంపలగూడెం

కాలుష్యంతో అనారోగ్య సమస్యలు

ఇబ్రహీంపట్నం: కాలుష్యంతో అనారోగ్య సమస్యలు వస్తాయని కేంద్ర ఇందనశాఖ మాజీ ముఖ్య కార్యదర్శి ఈఏఎస్ శర్మ అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గుంటుపల్లి, ఈలప్రోలు, కవులూరు, రాయనపాడులో రైతులతో కలసి ఆయన ఆదివారం పర్యటించారు. గృహిణులు, రైతులతో మాట్లాడి కాలుష్యం సమస్యలు తెలుసుకున్నారు. ఈప్రాంతంలో రసాయన పరిశ్రమల కారణంగా ఏర్పడుతున్న కాలుష్యంతో వ్యక్తుల్లో వివిధ రకాల వ్యాధులు, పశువుల్లో పునరుత్పత్తి సమస్యలు, నీటిలో లవణ శాతం పెరిగినట్లు గుర్తించారు. కాలుష్యం నివారణకు చేయాల్సిన విధివిధానాలపై అవగాహన కల్పించారు. ఏపీ కిసాన్ సర్వీస్ ఆర్గనైజేషన్ విభాగం సభ్యులు అక్కినేని భవానీప్రసాద్, చెరుకు వేణుగోపాల్, చుక్కపల్లి శ్రీలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు మహోత్సవం

ఎ.కొండూరు: మండలంలోని చీమలపాడు గ్రామానికి చెందిన హుజుర్ హజరత్ సూఫీ మహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరి బాబా ద్వితీయ ఉరుసు మహోత్సవాలను రెండురోజులుగా ఏఏఎంటీకే దర్బార్‌లో పీఠాధిపతి మహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ విజయనగరం హుజుర్ హజరత్ ఖాదర్‌బాబా దర్గా పీఠాధిపతి మొహమ్మద్ జలీల్‌బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జెండా, గంధం మహోత్సవాన్ని ప్రారంభించి బాబా చిత్రపటంతో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. దివ్య ఖురాన్ పట్టణం, ఉరుసు సందల్ షరీఫ్, అమ్మజాన్ దర్గాలో షరీఫ్ పవిత్ర పుష్పాంజలి, చాదర్ షరీఫ్, సందల్ సమర్పణ, సూఫీ సుగంధ గంధం, మహా ఊరేగింపు పుష్పాంజలి, పవిత్రజెండా ప్రతిష్ఠాపన పలు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బాబా దివ్య సమాధి వద్ద చాదర్, పూలు, గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేలాది మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో మహమ్మద్ జాఫర్ షరీఫ్, తాజ్ ఖాదర్ బాబు, బాబా భక్తులు పాల్గొన్నారు.



బాబా దివ్య సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పీఠాధిపతులు, భక్తులు



దర్గాలోఎమ్మెల్యే రక్షణనిధి

దర్గాను దర్శించుకున్న ఎమ్మెల్యే రక్షణనిధి

ఎ.కొండూరు: బాబా ఉరుసు మహోత్సవాల సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కె. రక్షణనిధి దర్గాను ఆదివారం రాత్రి దర్శించుకున్నారు. రక్షణనిధికి దర్బార్ పీఠాధిపతులు ఖాజ మొహియుద్దీన్, ఖలీల్ బాబులు పూల మాలలు శాలువాలతో సన్మానించిన అనంతరం బాబా దివ్య సమాధి వద్దకు వెళ్లి చాదర్, పూలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని దర్శించుకున్నారు. అనంతరం బాబా ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో తాజ్ ఖాదర్‌బాబు, జాఫర్ షరీఫ్ జెడ్పీటీసీ భూక్య గనియా, ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, సర్పంచ్ మోర్ల లక్ష్మీ, ఎంపీటీసీ కోల నాగమణి, వైస్ ఎంపీపీ గుంటక శివారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

మిట్టగూడెం(విస్సన్నపేట): క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని ఎంపీపీ పిల్లి మెర్సీవన జాక్షి అన్నారు. మండలంలోని తాతకుంట్ల పంచాయతీ మిట్టగూడెంలో గొంతెమ్మ (బతుకమ్మ) పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న ఏపీ, తెలంగాణ రాష్ట్రాల స్థాయి వాలీబాల్ పోటీలు మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. వాలీబాల్ పోటీలను ఎంపీపీ వీక్షించి జట్ల సభ్యులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ఏసీపీ రమేష్

మైలవరం: తెలంగాణలో త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆదివారం మైలవరం సర్కిల్ ఏసీపీ ఎం.రమేష్ హెచ్చరించారు. ఉన్నతాధికారుల సూచనలపై మైలవరం పీఎస్ పరిధిలోని సమీకృత అంతరాష్ట్ర సరిహద్దులోని చెక్‌పోస్టులను సందర్శించి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మైలవరం మండలం మొర్సుమల్లిలో కార్డన్ సెర్చ్ నిర్వహించి స్థానికులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. జూద క్రీడలు నిర్వహించినా, మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్నట్లు సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలపాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. తెలంగాణ సరిహద్దు గ్రామాల వారు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సీఐ మోహన రెడ్డి, మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు ఎస్సైలు పాల్గొన్నారు.

నేడు సచివాలయం, ఆరోగ్య కేంద్రాల భవనాలు ప్రారంభం

విస్సన్నపేట: కొర్లమండలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, గ్రామీణ ఆరోగ్య కేంద్రం భవనాలను ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని పేర్కొన్నారు.

200 మంది మహిళలకు క్యాన్సర్ ఉచిత నిర్ధారణ పరీక్షలు

తిరువూరు: మహిళల్లో క్యాన్సర్ కారక క్రిములను గుర్తించడానికి తిరువూరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. తిరువూరు బోస్ సెంటర్లోని కల్యాణి నర్సింగ్ హోం ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో విజయవాడ మణిపాల్ ఆసుపత్రి వైద్యులు పరీక్షలు చేశారు. 200 మంది మహిళలకు పరీక్షలు చేసినట్లు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. సంఘ అధ్యక్షుడు తాళ్లూరి రామకోటేశ్వరరావు, సభ్యులు పర్యవేక్షించారు.

ఈ- క్రాప్ బుకింగ్ జాబితాలపై అభ్యంతరాలుంటే తెలపండి

నూజివీడు: గ్రామ సచివాయాల్లో ఈ క్రాప్ బుకింగ్ పూర్తైన రైతుల జాబితాలను ప్రదర్శించామని, ఏమైనా అభ్యంతరాలుంటే వ్యవసాయ, ఉద్యాన సహాయకులకుగానీ, పంచాయతీ కార్యదర్శికిగానీ లిఖితపూర్వకంగా తెలపాలని ఏడీఏ జి.విద్యాసాగర్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రాప్ బుకింగ్‌తో పంటల బీమా పథకం, పంట రుణాలు, సున్నావడ్డీ పథకంతో పాటు వ్యవసాయశాఖ ద్వారా అందించే రాయితీలు రైతులు పొందవచ్చన్నారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సత్యనారాయణ మృతి

చాట్రాయి: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వానమాల సత్యనారాయణ (65) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి ఎనలేని సేవలందించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు మోరంపూడి నాగేశ్వరావు, సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి, ఉప సర్పంచ్ దిరిశాల చినబాబు, ఎంపీటీసీ దార్ల సోనీ ఆనంద్, పార్టీ నాయకులు జల్లేపల్లి పరమేశ్వరావు, వంకిణి వెంకటేశ్వరావు, శివ,వాసు తదితరులు సత్యనారాయణ మృతికి సంతాపం తెలిపారు.

నేడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం నిమిత్తం ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్న స్పందనలో డివిజన్‌లోని ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేయవచ్చన్నారు. ప్రజలు అందించిన అర్జీలను గడువులోగా సంబంధిత అధికారులు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఇబ్రహీంపట్నం: డిపో పరిధిలోని ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ ఎ.సుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య బస్సుల్లో ఎదురవుతున్న సమస్యలు, వాటిపై సలహాలు, సూచనలపై 99592 25457 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

గుణదలమాత స్వరూపంతో జపమాల ప్రదక్షిణ

విస్సన్నపేట: దశదిన జపమాల మహోత్సవాల సందర్భంగా స్థానిక రెడ్డిగూడెం రోడ్డులోని మరియ తల్లి గృహ నుంచి సెయింట్ అంబ్రోస్ దేవాలయంలోనికి గుణదల మాత స్వరూపంతో జపమాల ప్రదక్షిణ ఆదివారం నిర్వహించారు. సంఘస్తులు అధిక సంఖ్యలో ప్రదక్షిణ కార్యక్రమంలో పాల్గొన్నారు. విచారణకర్తలు పాల్ ముత్తూటిల్,జోజిబాబు, ఉపదేశులు, సంఘపెద్దలు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

నూజివీడు: ఎంఎస్‌పాలెం శివారులోని తోటల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ తన సిబ్బందితో దాడి చేశారు. పేకాడుతున్న తొమ్మిది మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.7820 నగదును, ఏడు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ జూదాలు నిర్వహిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆగిరిపల్లి: మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం జరుగుతున్న కోడిపందేలు, పేకాట శిబిరాలపై ఆగిరిపల్లి పోలీసులు దాడులు చేశారు. ఆగిరిపల్లి కొండకాలనీలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్సై నంబూరు చంటిబాబు దాడి చేసి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.1,670 నగదు స్వాధీనం చేసుకోగా, అడవినెక్కలంలో పేకాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 4 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. శోభనాపురంలో కోడిపందేలు వేస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.3,200 నగదు, రెండు కోడికత్తులను స్వాధీనం చేసుకున్నారు. వీరందరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై చంటిబాబు తెలిపారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడకల్చరల్: స్రవంతి కృష్ణా ఆర్కెస్ట్రా అండ్ ఈవెంట్స్, తెలుగు కళావాహిని, ఇంద్రకీలాద్రి కల్చరల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై ఆదివారం నిర్వహించిన తెలుగు హిందీ చిత్రగీతాల కార్యక్రమం ఆకట్టుకుంది. గాయకుడు స్రవంతి కృష్ణ ఆధ్వర్యంలో విష్ణు ప్రియ సుశీల్‌కుమార్, భారతి, దుర్గానాగమణి, పి.శ్రీనివాసరావు, కోటా శ్రీనివాసరావులు తెలుగు, హిందీ చిత్రగీతాలను మధురంగా ఆలపించారు. గాయకుడు స్రవంతి కృష్ణ మాట్లాడుతూ నూతన గాయనీ గాయకులకు వేదికను కల్పించాల్సిన అవసముందన్నారు. సంస్థ ద్వారా పేద కళాకారులకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చింతకాయల చిట్టిబాబు, ప్రోగ్రామ్ కన్వీనర్ కేఎస్ఎన్ మూర్తి, పరచూరి విజయలక్ష్మి పాల్గొన్నారు. గాయకుడు సుశీల్‌కుమార్‌ను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.



సినీ గీతాలు పాడుతున్న గాయనీ గాయకులు

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెనుగంచిప్రోలు: మండల కేంద్రం పెనుగంచిప్రోలులో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడం ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.